తుపాను ప్రభావంతో అన్నదాతల కలవరం

- అధికారుల సూచనలతో వరికోత పనుల వాయిదా
- కల్లాల్లో ధాన్యం భద్రపరచుకునే పనుల్లో నిమగ్నం



బుట్టాయగూడెం: కృష్ణాపురం సమీపంలో కల్లాల్లో ఉన్న ధాన్యం బరకాలతో కప్పిన దృశ్యం



బుట్టాయగూడెం: పైడావారిగూడెం సమీపంలో ధాన్యాన్ని గోనె సంచుల్లో నింపుతున్న దృశ్యం

బుట్టాయగూడెం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం తుపానుగా మారి తీవ్రమైన ఈదురు గాలులు, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో అన్నదాతలు తీవ్రమైన ఆందోళనకు గురవుతున్నారు. ఒకపక్క చేతికి వచ్చిన పంట నష్టపోతామనే భయంతో కొందరు రైతులు యంత్రాలతో వరికోతల పనులు పూర్తి చేసుకుని ధాన్యాన్ని ఆర్‌బీకేకు తరలిస్తున్నారు. అలాగే మరికొందరు ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. అయితే మరికొందరు అధికారుల సూచనలతో వరిపంట కోత పనులను వాయిదా వేసుకున్నారు. ఇంకొందరు ధాన్యాన్ని కల్లాల్లోనే ఉంచి ధాన్యం తడిచిపోకుండా బరకాలు కప్పి పంటలను కాపాడుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. సోమవారం ఉదయం నుంచి కారుమబ్బులతో మోస్తారు వర్షం కురుస్తూనే ఉంది. మరొక మూడు రోజుల పాటు పరిస్థితి ఇలానే ఉంటుందనే వాతావరణ శాఖ ప్రకటనతో అధికారులు అప్రమత్తమయ్యారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని జాగ్రత్తలు చేపట్టారు. కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని ఏఓ బి.సుమలత పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. కాగా బుట్టాయగూడెం మండలంలో సుమారు 3,511 ఎకరాల్లో ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంట పండించినట్లు తెలిపారు. దీనిలో ఇప్పటివరకూ 943 ఎకరాలు వరి కోతలు పూర్తయ్యాయని ఏఓ చెప్పారు. అలాగే 77.9 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేశామన్నారు. 26 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉందన్నారు. అదేవిధంగా 157 మెట్రిక్ టన్నుల ధాన్యం కల్లాల్లో ఉందని ఆ ధాన్యం తడిచిపోకుండా రైతులు తగు జాగ్రత్తలు తీసుకునే విధంగా పలు సూచనలు ఇచ్చినట్లు ఏఓ తెలిపారు.

రైతులు ఇబ్బందులు పడకుండా ధాన్యం కొనుగోలు

పోలవరం రూరల్: తుపాను ప్రభావంతో ఏ ఒక్క రైతు ఇబ్బంది పడకుండా వెంటనే ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని మండల వ్యవసాయశాఖాధికారి ఎం.రాంబాబు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రైతులు కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం తేమ శాతం తక్కువ ఉన్నప్పటికీ ఆఫ్‌లైన్‌లో కొనుగోలు చేయాలని ఉన్న ఆదేశాల మేరకు రైతుల నుంచి ధాన్యం సేకరించడం జరుగుతుందన్నారు. మండలంలో 6,143 ఎకరాల్లో వరి సాగుచేయగా, 1900 ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయన్నారు. ఇప్పటివరకు 2,300 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. మరో 600 మెట్రిక్ టన్నుల ధాన్యం రాశుల మీద ఉందన్నారు. రాశుల మీద ఉన్న ధాన్యాన్ని సంబంధిత రైతులందరూ రైతు భరోసా కేంద్రాల సిబ్బందికి తెలియజేసి ధాన్యం మిల్లులకు తరలించాల్సిందిగా తెలిపారు. ధాన్యం కొనుగోలు సిబ్బంది మీ ప్రాంతాలకు వచ్చి ధాన్యం సేకరిస్తారన్నారు. మండలంలో పలు చోట్ల రాశులుగా ధాన్యం పోసి బరకాలు కప్పిన వాటిని ఏవో సోమవారం పరిశీలించారు.

అందుబాటులో సిబ్బంది

పోలవరం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ బి.సుమతి వీఆర్‌వోలతో సమావేశం నిర్వహించారు. మండలంలో తుపాను ప్రభావంతో ఎక్కడా ఏ విధమైన సమస్యలు ఎదురైనా వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.అలాగే ధాన్యం రాశులు పోగుపెట్టిన రైతులు ఎవరైనా ఉంటే వాటికి సంబంధించి రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసేలా చూడాలన్నారు. సమావేశంలో వ్యవసాయశాఖాధికారి రాంబాబు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

లింగపాలెం: తుపాను కారణంగా ప్రస్తుతం రైతులు వరి పైరును కోయవద్దని మండల వ్యవసాయాధికారి కె మురళీకృష్ణ సూచించారు. సోమవారం ఆయన మండలంలోని పలుగ్రామాలలో పర్యటించి రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షంలో తడవకుండా ధాన్యాన్ని భద్రపర్చుకోవాలన్నారు. తడిసిన వరిధ్యానం సైతం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. మూడు రోజుల వరకు వరి కోతలు కోయవద్దని ఆయన రైతులకు సూచించారు.

కొయ్యలగూడెం: మండలంలో పొంగుటూరు గవరవరం, ఎర్రంపేట, రాజవరం గ్రామాలలో వరి ధాన్యం కోసిన పొలాలను తహసీల్దార్ పి.నాగమణి, మండల వ్యవసాయ అధికారి ఎస్.చెన్నకేశవులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొనుగోలుకు సిద్ధంగా ఉన్న ధాన్యాన్ని ఆర్‌బీకే ద్వారా రైస్ మిల్లర్లకి పంపించడం జరిగిందని అన్నారు. ఆర్‌బీకేలకు ఆఫ్‌లైన్ మోడ్‌లో ధాన్యాన్ని మిల్లులకు చేరవేయడంపై చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. లారీలు అందుబాటులో లేనిఎడల రైతులు తమ సొంత ట్రాక్టర్లలో తరలించుకోవచ్చు అని సూచించారు. మండలంలో కోసిన ధాన్యం 700 మెట్రిక్ టన్నులు ఉన్నట్లు తెలిపారు. మూడు లారీల్లో అరవై టన్నుల ధాన్యాన్ని ఇప్పటివరకు తరలించామన్నారు.



బుట్టాయగూడెం: సీతప్పగూడెంలో కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని పరిశీలించి రైతులకు సూచనలు ఇస్తున్న ఏఓ సుమలత



పోలవరం: బరకాలు కప్పిన ధాన్యం రాశులను పరిశీలిస్తున్న మండల వ్యవసాయ శాఖాధికారి రాంబాబు



లింగపాలెం: వరి ధాన్యంపై బరకాలు కప్పించి రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయాధికారి మురళీకృష్ణ



కొయ్యలగూడెం: పొంగుటూరులో రైతులకు ముందస్తు జాగ్రత్త చర్యలపై వివరిస్తున్న అధికారులు

రైతులకు అండగా ప్రభుత్వం



ఉన్నమట్ల ఎలీజా, చింతలపూడి ఎమ్మెల్యే

చింతలపూడి: మిచౌంగ్ తుపాను నేపథ్యంలో రైతులు ధాన్యం గురించి ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా విజ్ఞప్తి చేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ధాన్యంలో తేమ శాతాన్ని పరిగణనలోకి తీసుకోకుండా రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పారు. నియోజకవర్గంలోని రైతు భరోసా కేంద్రాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ధాన్యం సంచులు, రవాణా, హమాలీ ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. ఈ కష్టకాలంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, సొసైటీ అధ్యక్షులు, పార్టీ నాయకులు ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులకు ఇబ్బందులు కలగకుండా అండగా నిలబడాలని ఆదేశించారు.

అప్రమత్తంగా ఉండండి

భారీ వర్షాల నేపథ్యంలో నియోజకవర్గంలోని రెవెన్యూ, విద్యుత్ శాఖాధికారులతో పాటు అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే ఎలీజా ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని, వ్యవసాయాధికారులు రైతులకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు సూచనలు అందచేయాలని సూచించారు. ప్రజలు కూడా తగిన జాగ్రత్తలు వహించి అధికారులకు సహకరించాలని కోరారు. ప్రజలకు ఏ అవసరమొచ్చినా ఆదుకోవడానికి సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే ఎలీజా కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

ప్రజల హృదయాల్లో జగన్‌కు సుస్థిర స్థానం

- పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు
- వెంకటాపురంలో ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవం



వెంకటాపురంలో నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

కుక్కునూరు: ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల హృదయాల్లో సుస్థిరస్థానం సంపాదించుకున్నారని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. సోమవారం మండలంలోని శ్రీధర వేలేరు సచివాలయ పరిధిలో సోమవారం నిర్వహించిన ఆంధ్రాకు జగనన్నే ఎందుకు కావాలంటే.. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాల్లో బాలరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటాపురం గ్రామం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో రూ.87 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవనాలను జెడ్పీటీసీ కుంజా నాగేశ్వరావు, ఏఎంసీ డైరెక్టర్ గంగుల రమణారెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం శ్రీధర వేలేరు సచివాలయ పరిధిలోని వేలేరు, నడిగూడెం, సీతారామనగరం గ్రామాలలో ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా స్థానికులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించిన ఆయన ఆ సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వేలేరు సచివాలయంలో జరిగిన సమావేశంలో బాలరాజు మాట్లాడుతూ కరోనా వంటి విపత్కర పరిస్థితులలో చంద్రబాబుకి, ఆయన దత్తపుత్రుడికి రాష్ట్ర ప్రజలు గుర్తుకు రాలేదన్నారు. కరోనాతో ప్రపంచ దేశాలు విలవిలలాడుతుంటే ఈ నాయకులు తాము, తమ కుటుంబం బాగుంటే చాలంటూ రాష్ట్రంలో లేకుండా హైదరాబాద్‌లో దాక్కున్నారని విమర్శించారు. సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతుండడంతో రాష్ట్ర ప్రజలు గుర్తొచ్చి రోడ్లెక్కుతున్నారని ఎద్దేవా చేశారు. పొత్తులేనిదే ఒంటరిగా పోటీ చేయలేని నాయకులు కూడా జగనన్నను విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన కావాలంటే మరోసారి ప్రజలందరూ జగనన్ననే ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు తాండ్ర రాజేష్, గాడిద రామచంద్రం, రావు వినోద్, ఎల్లంకి లక్ష్మణ్‌రావు, అచంట మాధవరావు, సరా శ్రీహరి, నరేష్, బిక్కసాని ఉమేష్, నిమ్మల ప్రసాద్, సాంబ, వీరబాబు, గృహసారథులు, జేసీఎస్ కన్వీనర్లు పాల్గొన్నారు.

పోలవరం పనులను పరిశీలించిన జెడ్పీ చైర్‌పర్సన్



పోలవరం పనులను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ సోమవారం పరిశీలించారు. స్పిల్‌వే, ఎగువ కాఫర్ డ్యామ్, వ్యూ పాయింట్‌ల నుంచి పనులను పరిశీలించారు. ప్రాజెక్టులో జరుగుతున్న పనుల వివరాలను ఇంజినీరింగ్ అధికారులు వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుగ్గా మురళీకృష్ణ, గూటాల, పోలవరం సొసైటీ అధ్యక్షుడు సుంకర అంజిబాబు, బండారు అప్పారావు, మండల సచివాలయాల కన్వీనర్ మాదేపల్లి సాయిరామ్, వైఎస్సార్ సీపీ నాయకులు పాడుం శ్యామ్‌కుమార్, ఎంపీడీవో జి.శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

వీరేశ్వర స్వామి సన్నిధిలో...

పట్టిసం శివక్షేత్రాన్ని సోమవారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ దంపతులు దర్శించారు. శ్రీ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు. ఆలయ అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, దేవస్థానం ఈవో ఎస్.సంగమేశ్వర శర్మ జెడ్పీచైర్‌పర్సన్ పద్మశ్రీ దంపతులకు శ్రీ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఫొటోను అందించారు.

స్పందనలో 20 అర్జీలు

జంగారెడ్డిగూడెం: స్పందనలో వచ్చిన అర్జీలను సత్వరం పరిష్కరించాలని ఆర్డీవో అద్దయ్య అధికారులను ఆదేశించారు. సోమవారం జంగారెడ్డిగూడెం ఆర్డీవో కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ స్పందనలో వచ్చిన అర్జీలపై ఎటువంటి అలసత్వం వహించరాదన్నారు. ముఖ్యంగా ప్రజలు ఇచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కరించే సమయాన్ని తెలియజేయాలన్నారు. అలాగే నిర్దేశిత గడువులోగా సమస్య పునరావృత్తం కాకుండా పరిష్కరించాలని సూచించారు. ప్రతి ఒక్క అర్జీదారుడు పరిష్కారం పట్ల సంతృప్తి వ్యక్తం చేయాలని సూచించారు. కాగా సోమవారం నాటి స్పందన కార్యక్రమంలో 20 అర్జీలు వచ్చాయన్నారు. పైడిపాక గ్రామానికి చెందిన మట్టా సరోజిని, దాసరి గంగాధరరావు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కోసం, టెక్కినవారిగూడెంకు చెందిన పోతన రామకృష్ణ తన భూమిలోకి వెళ్లకుండా అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని, పేరంపేటకు చెందిన కలపాల శాంతమ్మ డ్వాక్రా సీపీ ద్వారా రావాల్సిన సొమ్ములు ఇప్పించాలని, ములగలంపల్లికి చెందిన కొప్పుల సత్యనారాయణ తనకు దిబ్బగూడెంలో ఉన్న భూమి కాలువ భూమిగా చూపిస్తోందని, తన పేరున మార్పు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కాగా ఎక్కువగా అర్జీలు భూ సంబంధిత సమస్యలపై వచ్చినట్లు ఆర్డీవో తెలిపారు.

విజయదుర్గమ్మ ఆలయంలో కార్తీకమాస పూజలు



విజయదుర్గమ్మ ఆలయంలో శివలింగానికి అభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: కార్తీక మాసఉత్సవాలను పురస్కరించుకొని పట్టణంలోని విజయదుర్గమ్మ ఆలయంలో కొలువై ఉన్న శ్రీవిజయదుర్గ సహిత శ్రీ పంచభూత మరకత లింగేశ్వరస్వామికి మూడవ సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి ఆలయంలో ఏకాదశ రుద్రాభిషేకాలు బ్రహ్మశ్రీ ఈమని శశికుమార్ పర్యవేక్షణలో, ఆలయ అర్చకులు సుదర్శనం వేణుగోపాలాచార్యులు, వేద పండితులు సత్య కిరణ్ వైభవంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలకు ఉభయ ధారులుగా సొసైటీ అధ్యక్షుడు వందనపు వెంకటేశ్వరరావు, సాయిబాల పద్మ దంపతులు, డాక్టర్ రాజాన పండు, డీవీ భాస్కరరావు తదితరులు వ్యవహరించారు. తొలుత వినాయక పూజ అనంతరం తొలుత పార్థివ శివలింగానికి అభిషేకాలు, మరకత శివలింగానికి అభిషేకం, స్పర్శ దర్శనం నిర్వహించారు. పూజా కార్యక్రమాలను ఆలయ శాశ్వత కమిటీ చైర్మన్ మారిశెట్టి రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి మాదా రామమోహన్ పర్యవేక్షించారు.

బ్రాహ్మణులు అన్ని రంగాల్లో రాణించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పేరి కామేశ్వరరావు

జంగారెడ్డిగూడెం: బ్రాహ్మణులు అన్ని రంగాల్లో రాణించాలని జంగారెడ్డిగూడెం ప్రాంతీయ బ్రాహ్మణ పరిషత్ గౌరవ అధ్యక్షుడు మల్లాది సీతరామారావు, అధ్యక్షుడు చిలుకూరి సాయిబాబు, కార్యదర్శి కూచిభట్ల రాములు అన్నారు. ఏలూరు రోడ్ గల షిరిడి సాయిబాబా స్థూపం వద్ద పర్వతం తులసిరావు మామిడితోటలో కార్తీక వనసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పేరి కామేశ్వరరావు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా బ్రాహ్మణులు సంఘటితమై అన్ని రంగాల్లో రాణించాలని, అన్నీ రాజకీయ పార్టీలు బ్రాహ్మణ సామాజిక వర్గానికి సముచిత స్థానం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కిరణ్ రాయల్, గాయత్రి జిల్లా బ్రాహ్మణ సంఘ కార్యదర్శి కాశిబొట్ల పార్వతీశ్వరశర్మ, కర్ర శ్రీధర్, మీడియా సలహాదారు లంకా నాగకుమార్, కూచి త్రినాథరావు, గన్నవరపు మాధవరావు, నిడుమోలు చిరంజీవిరావు, చిలుకూరి లక్ష్మీనారాయణ, కృష్ణప్రియ, తిప్పబొట్ల రామకృష్ణ, ఈరంకి రవి, తదితరులు పాల్గొన్నారు.

శివయ్యకు విశేష అభిషేకాలు



ద్వారకాతిరుమల క్షేత్రపాలకుని ఆలయంలో శివయ్యకు హారతులిస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల: క్షేత్రపాలకునిగా విరాజిల్లుతోన్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామివారి ఆలయంలో మూడవ కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని శివదేవునికి విశేష అభిషేకాలు నిర్వహించారు. ముందుగా దేవస్థానం సిబ్బంది ఆలయాన్ని సుగంధ భరిత పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించారు. తెల్లవారుజాము నుంచే ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారికి అభిషేకాలు, పూజాధికాలను జరుపుకున్నారు. అలాగే ఆలయ ప్రాంగణంలోని ఉసిరిచెట్ల వద్ద మహిళలు కార్తీక దీపాలను వెలిగించి తమ భక్తి ప్రపత్తులను చాటారు. ఆలయ గర్భాలయంలో కొలువైన శివదేవుని లింగస్వరూపానికి ఆలయ అర్చకులు వేద మంత్రోచ్ఛరణల నడుమ క్షీరాభిషేకాలు నిర్వహించారు. రాత్రి శివయ్యకు జరగాల్సిన గ్రామోత్సవం తుపాను కారణంగా రద్దయ్యింది.

రంగాపురంలో సత్యదేవుని వ్రతాలు



రంగాపురం శ్రీసత్యన్నారాయణ స్వామి ఆలయంలో వ్రతాలు జరుపుకుంటున్న భక్తులు

లింగపాలెం: కార్తీక మాసం పురస్కరించుకుని రంగాపురంలోని శ్రీసత్యన్నారాయణస్వామి ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. అధిక సంఖ్యలో భక్తులు ఆలయంలో సత్యన్నారాయణస్వామి వ్రతాలను జరుపుకున్నారు. ఇక్కడకు పశ్చిమగోదావరి జిల్లా నుంచే కాకుండా కృష్ణా, ఖమ్మం జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి వ్రతాలు జరుపుకున్నారు. రంగాపురం ఆలయ ప్రధాన గుమస్తా శెట్టిపల్లి గోపి పర్యవేక్షణలో, ప్రధాన అర్చకులు శేషాచార్యులు భక్తులచే వ్రతాలు చేయించారు.

క్లుప్తంగా

సంక్షేమ పాలన జగనన్నకే సాధ్యం



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం

లింగపాలెం: సంక్షేమ పథకాలు పారదర్శకంగా పేదలకు చేరాలంటే మరలా ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహనరెడ్డి రావాలని సర్పంచ్ పింగుల శోభారాణి అన్నారు. తోచలకరాయుడు పాలెం గ్రామంలో సోమవారం సర్పంచ్ శోభారాణి ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వైఎస్సార్ సీపీ నేతలు మాట్లాడుతూ సంక్షేమ పాలన జగనన్నకే సాధ్యమని అన్నారు. అనంతరం సంక్షేమ లబ్ధి వివరాలను తెలిపే బోర్డును ఆవిష్కరించి పార్టీ జెండాను ఎగురవేశారు. ఎంపీటీసీ పాదిల మరియమ్మ, ఈవోపీఆర్డీ తర్నకుమార్, ఉపసర్పంచ్ బేతిన మధు, పార్టీ నాయకులు పి బాబురావు, పి ఉదయరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మద్ది ఆంజనేయస్వామికి తమలపాకులతో లక్షార్చన



లక్షార్చన పూజలు నిర్వహించిన దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: కార్తీక మాస మహోత్సవాల్లో భాగంగా గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి స్వామి వారికి ఆదివారం లక్ష తమలపాకులతో లక్షార్చన పూజలు చేశారు. అర్చకులు, వేద పండితులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులు హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. ఈవో ఆకుల కొండలరావు, ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావు పాల్గొన్నారు.

మానవత ఆర్థిక సాయం

చింతలపూడి: ఓ బాధిత కుటుంబానికి స్థానిక మానవత స్వచ్ఛంద సంస్థ సోమవారం ఆర్థిక సాయం అందజేసింది. సుబ్రింపేటకు చెందిన హెచ్చు శ్రీను ఇటీవల చెట్టు విరిగి పడటంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. సోమవారం మానవత సంస్థ సభ్యులు శ్రీను కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. మానవత డైరెక్టర్ డా ఎ.సత్యన్నారాయణ, సొసైటీ మాజీ చైర్మన్ ఏ సుబ్బారావు, చింతలపూడి మానవత శాఖ చైర్మన్ ఆర్నేపల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల జయంతి

జంగారెడ్డిగూడెం: సంగీత ప్రపంచంలో సువర్ణాక్షరాలతో తన పేరును లిఖించుకున్న గొప్ప సంగీత దర్శకుడు, నేపథ్య గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు అని అభిమానులు పేర్కొన్నారు. ఘంటసాల జయంతి సందర్భంగా జంగారెడ్డిగూడెంలోని బుట్టాయగూడెం రోడ్డులో ఉన్న ఘంటసాల విగ్రహానికి అభిమానులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఘంటసాల పాటల మాధుర్యం, ప్రతిభాపాటవాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో చిలుకూరు సుబ్బయాచారి, సీహెచ్‌ఆర్, ఎంఎస్‌ఆర్, కీరా శ్రీధర్, తిప్పాబొట్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేత ఆనంద్‌రావు మృతి



వల్లి ఆనంద్‌రావు (ఫైల్)

వేలేరుపాడు: వేలేరుపాడు మండల పరిధిలోని ఎడవల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ యువజన నేత, ప్రైవేటు వైద్యుడు వల్లి ఆనంద్‌రావు(39) అనారోగ్యంతో ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు. వారం రోజుల క్రితం ఆనంద్‌రావుకు బ్రెయిన్ స్ట్రోక్‌తో పక్షవాతం రావడంతో తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం ఆసుపత్రికి అక్కడ నుంచి విజయవాడ ఎన్‌ఆర్ఐ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఆనంద్‌రావు మృతికి ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ కేసగాని శ్రీనివాసగౌడ్, ఎంపీపీ వల్లా లక్ష్మీదేవి, జెడ్పీటీసీ గుజ్జా రామలక్ష్మి సంతాపం తెలిపారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

జంగారెడ్డిగూడెం రూరల్: లక్కవరంలో రైతుల పొలాల మీదుగా విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి వైర్లను సరిచేశారు. ఆదివారం ఈ గ్రామంలో విద్యుత్ వైర్లు తగిలి గడ్డిట్రాక్టర్ దగ్ధమైన విషయం పాఠకులకు తెలిసిందే. దీంతో ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.రాధాకృష్ణ ఆదేశాలతో ఏడీఈ సుబ్బారావు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి చర్యలు చేపట్టారు. రైతుల పొలాల మీదుగా 3 విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి వైర్లను సరిచేశారు.

స్పోర్ట్స్ కిట్ల పంపిణీ

కొయ్యలగూడెం: తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో బయ్యనగూడెం, సరిపల్లి, మంగపతిదేవిపేట, గ్రామాలలో యువతకు సోమవారం స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సంస్థ కోఆర్డినేటర్ ఆరేటి ఏసుబాబు తెలిపారు. బయ్యనగూడెం అంబేడ్కర్ బొమ్మ వద్ద ఎస్సీ కాలనీ క్రీడాకారులకు వాలీబాల్ కిట్లు అందించారు.